
క్లుప్తంగా

సిబార్ దంత వైద్య కళాశాలలో ఉచిత సేవలు

పెదకాకాని:ఇండియన్ ప్రోస్థోడాంటిక్స్ డే సందర్భంగా పేదలకు ఉచిత దంత వైద్యసేవలు అందించనున్నట్లు సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎల్. కృష్ణప్రసాద్ తెలిపారు. పూర్తిగానూ, పాక్షికంగా పళ్ల లేనివారికి తీసి పెట్టుకునే పద్ధతిలో ఉచితంగా సెట్టు కడతామని పేర్కొన్నారు. ఈనెల 22వ తేది ప్రోస్థోడాంటిక్స్ డే పురస్కరించుకుని కృత్రిమ పళ్ల సెట్ కోసం 23, 24, 25 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలోని కట్టుడు పళ్ల విభాగంలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు డాక్టర్ జి. ఫణికృష్ణ (86888 93043), డాక్టర్ నాగ ఫణీంద్ర (63019 32833)లను సంప్రదించాలని తెలిపారు. ఇండియన్ ప్రోస్థోడాంటిస్ట్స్ డే సందర్భంగా దంత వైద్య విద్యార్థులు అందంగా, ఆకర్షణీయంగా రంగవల్లులను తీర్చిదిద్దారు.

కాపర్ వైర్లు చోరీ



కాకుమాను:పంప్ హౌస్‌లో కాపర్ వైర్ చోరీకి గురైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది.పెదనందిపాడు మండలం పాత మద్రాసు రోడ్డులోని వరగాని,అ బ్బినేనిగుంటపాలెం గ్రామాల మధ్య మల్లాయపాలెం మేజర్ కాలువపై ఉన్న పంపుహౌస్ ఉంది. ఫ్యూజ్ బాక్స్‌లో కాపర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి అపహరణకు గురైన ఫ్యూజ్‌బాక్సును పరిశీలించి, స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కిట్స్ అధ్యాపకురాలికి అవార్డు



ప్రత్తిపాడు: కిట్స్ కళాశాల ఈసీఈ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ పచ్చల సరళకు సావిత్రీ బాయి పూలే అవార్డు లభించినట్లు ప్రిన్సిపాల్ పి. బాబు తెలిపారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన సావిత్రీ బాయి పూలే నేషనల్ ప్రతిభా అవార్డ్స్ ప్రదానంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగంలో వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ కళాశాల అధ్యాపకురాలు సరళ ప్రతిభను చాటి జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చైర్మన్ కోయి సుబ్బారావు ఆమెను అభినందించారు. తమ కళాశాల అధ్యాపకురాలు అవార్డు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. అభినందించిన వారిలో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ కె.హరిబాబు, ఈసీఈ విభాగాధిపతి ఎస్. ఆదినారాయణ ఉన్నారు.

శరీరంపై స్పర్శ లేని మచ్చలను అశ్రద్ధ చేయొద్దు



ప్రత్తిపాడు: శరరంపై స్పర్శలేని మచ్చలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఏ. శ్రవణ్ తెలిపారు. పెదనందిపాడు మండలం వరగానిలో జరుగుతున్న ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్)ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. పూర్తి చేసిన గృహాలకు మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ ఫిబ్రవరి రెండవ తేదీ వరకు గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు చెప్పారు.
మందమైన మెరిసే జిడ్డు చర్మం, చెవులపై, వీపుపై, నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూతబడకపోవడం వంటివి కుష్ఠు వ్యాధి లక్షణాలని తెలిపారు. పై లక్షణాలున్న వారు స్థానికంగా ఉన్న ఏఎన్ఎం, ఆశాలను సంప్రదించాలని కోరారు. ప్రతి ఇంటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి సర్వే చేయాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వ్యాక్సినేషన్‌తో పాటు రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వండి మహాప్రభో !

- ఇళ్ల స్థలాల కోసం పేదల ఎదురుచూపులు
- అర్జీలు అందజేసినా ఫలితం శూన్యం



నంబూరు వెళ్లే రోడ్డు పక్కన యానాదులు గుడిసెలు

పెదకాకాని: నిలువనీడ లేని పేదలు ఇళ్ల స్థలాల కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. మండలంలో ప్రభుత్వ భూములు పుష్కలంగా ఉన్నప్పటికీ అవి ఆక్రమణ చెరలో ఉన్నాయి. అయితే, పెదకాకాని తహసీల్దార్ కార్యాలయ రికార్డుల్లో మాత్రం అసైన్డు భూములుగానే నమోదై ఉండటం విశేషం. ఆ భూములు మాత్రం ప్రైవేటు వ్యక్తుల అనుభవంలో ఉన్నాయి. నివసించడానికి సెంటు స్థలం లేని పేదలకు మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు.

అద్దె ఇళ్లలో అవస్థలు

పేద, దిగువస్థాయి మధ్య తరగతి ప్రజలు ఒకటో తేదీ వస్తుందంటేనే ఇంటి అద్దె చెల్లించడానికి భయపడుతున్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలని అధికారులను కలసి వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదు. పెదకాకాని గ్రామంలోని సుందరయ్యకాలనీ, స్వర్ణపురికాలనీ, వడ్డెరకాలనీ, ఎన్‌టీఆర్ కాలనీ, పుష్పరాజ్‌కాలనీ, వైఎస్సార్ కాలనీ, యానాదికాలనీ పేర్లతో నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్నారు. తాగునీరు, రోడ్లు, మురుగుకాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేసినప్పటికీ ఇళ్ల పట్టాల పంపిణీ మాత్రం జరగలేదు. యానాదికాలనీలో కనీస వసతులు కూడా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షం వచ్చిన సమయంలో గుడిసెల్లోకి నీరు చేరి అవస్థలు పడుతున్నారు. యానాది కాలనీలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సందర్శించి నిరుపేదల సమస్యలు పరిష్కరించాలని, స్థలాలు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

స్థలాల పంపిణీపై నీలినీడలు

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారులు ఇళ్ల స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్న వారిని విచారించి సుమారు 1974 మంది లబ్ధిదారులను గుర్తించారు. వారందరికీ అమరావతి రాజధాని ప్రాంతంలోని నవులూరు, మొద్దూరు, నక్కల్లు ప్రాంతాల్లో స్థలాలు కేటాయిస్తూ పంపిణీ కూడా చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ లబ్ధిదారుల జాబితాను మరోసారి విచారించి, 1748 మందిని గుర్తించింది. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటిని పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

స్థలాలు మంజూరు చేయాలి



నంబూరు వెళ్లే రోడ్డులోని ప్రభుత్వ భూమిలో 64 కుటుంబాలు యానాదులం కాలువ కట్టల పైనా, పొలాల్లో గుడిసెలు వేసుకుని బతుకుతున్నాం. స్థలాల కోసం అనేక సార్లు ఉన్నతాధికారులను కలసి మా మెర చెప్పుకున్నాం. స్థలాలు, పట్టాలు ఇస్తామన్నారు. ఇప్పటికీ స్థలం రాలేదు. పొలాల్లో ఎలుకలు పట్టుకుని, పారిశుద్య కార్మికులుగా బతుకుతున్నాం. ఎక్కడా సెంటు భూమి కూడా లేదు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి స్థలాలు మంజూరు చేయాలని వేడుకొంటున్నాం.

–పొట్లూరి చినవెంకటేశ్వర్లు, యానాదికాలనీ, నంబూరు.

ఇళ్లలోకి పాములు వస్తున్నాయి



రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్నాం. కాలనీలో రోడ్డు గానీ, మురుగుకాలువ గానీ ఏర్పాటు చేయలేదు. కనీస వసతులు లేకపోవడంతో ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. వాన కురిసినపుడు పొయ్యిలు ముట్టించి అన్నం వండుకోవడం కూడా కష్టమే. గుడిసెల చుట్టూ వర్షపు నీరు చేరడమే కాకుండా లోపలకు నీళ్లు కూడా వస్తున్నాయి. పిల్లలతో కలసి గ్రామంలో ప్రభుత్వ బడుల్లో తలదాచుకుంటున్నాం. స్థలాలు ఇచ్చి కనీస వసతులు కల్పించాలి.

–చలంచర్ల వెంకటరమణ, యానాదికాలనీ, నంబూరు

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి



మండలంలోని సుందరయ్య కాలనీ, వడ్డెర కాలనీ, స్వర్ణపురి కాలనీ, పుష్పరాజ్ కాలనీ, ఎన్‌టీఆర్ కాలనీ, వైఎస్సార్ కాలనీల్లో నివాసం ఉంటున్న పేదలందరికీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి. అనేక సార్లు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశాం. 2008 నుంచి కలసిన ప్రతిసారి పరిశీలిస్తున్నాం.. పట్టాలు మంజూరు చేస్తాం అని చెబుతున్నారు. అమలుకు మాత్రం నోచుకోవడం లేదు.

–నన్నపనేని శివాజీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, పెదకాకాని

రోడ్లను ఆక్రమిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్



వ్యాపారులను హెచ్చరిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు: పట్టణంలోని ప్రధాన రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు హెచ్చరించారు. 'ఇరుకు దారులు.. కదలని వాహనాలు' శీర్షికన ఆక్రమణలతో ప్రజల ఇబ్బందులను తెలియజేస్తూ ఈ నెల 18వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం పట్టణంలో ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జీబీసీ రహదారిని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి, డ్రైనేజీకి వెనుక మాత్రమే నిర్వహించుకోవాలని సూచించారు. హద్దు దాటి ప్రయాణికులకు, ఆర్టీసీ బస్సులకు, వాహనాలకు అడ్డుగా వస్తే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారం నిర్వహించుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రవికిరణ్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి రాఘవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, అంగన్‌వాడీ సహాయకుల పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో వి. సుజాతదేవి తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం ఆమె తమ కార్యాలయంలో విడుదల చేశారు. గుంటూరు రూరల్ మండలం మల్లవరం అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు (ఓసి)కు, ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం ఓసీ–1 సెంటరు (ఓసి), పెదనందిపాడు మండలం వరగాని బీసి సెంటరు (ఓసి), వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు డీడబ్ల్యూ–1 (ఎస్సీ), ముట్లూరు సౌత్ ఏరియా సెంటరు (ఓసి), చమళ్లమూడి బీసీ సెంటరుకు (బిసి–ఏ), చింతపల్లిపాడు మెయిన్ సెంటరు (ఓసి), గుంటూరురూరల్ మండలం వెంగళాయపాలెం ఎస్సీ–2 సెంటరు (ఎస్సీ–డబ్ల్యూ), కాకుమాను మండలం చినలింగాయపాలెం ఎస్సీ–2 సెంటరు (ఎస్సీ), గరికపాడు ఎస్టీ సెంటరు (ఎస్టీ) సెంటర్లలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 2024 జులై ఒకటవ తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్ల లోపు వయస్సు ఉండి, స్థానిక వివాహిత మహిళలై ఉండాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తకు పదవ తరగతి, సహాయకురాలికి ఏడవ తరగతి విద్యార్హత ఉండాలన్నారు. అసక్తి ఉన్నవారు ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ప్రత్తిపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సీడీపీవో కోరారు.

ఆరు సెంటర్లకు రీ నోటిఫికేషన్

ప్రత్తిపాడు మండలం యనమదల శివాలయం సెంటరు, నడింపాలెం ఎస్సీ కాలనీ సెంటరు, గనికపూడి డీడబ్ల్యూ సెంటరు, పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెం సెంటరు, వట్టిచెరుకూరు మండలం ముట్లూరు వడ్డెరపాలెం సెంటర్లలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులను భర్తీ చేసేందుకు రీ నోటిఫికేషన్ ఇచ్చినట్లు సీడీపీవో చెప్పారు. గతంలో ఆయా సెంటర్లకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు జరిగినప్పటికీ, వారికి పోస్టింగులు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పుడు వారంతా ఇంటర్వ్యూకి అర్హులవుతారని, కొత్త వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సీడీపీవో వివరించారు.

ఆర్‌వీఆర్‌జేసీలో శిక్షణ తరగతులు ప్రారంభం



తరగతులను ప్రారంభిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మెరుగైన విద్యా బోధనకు నిపుణుల బృందం నిర్వహించే శిక్షణ తరగతులు దోహదపడతాయని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో సోమవారం అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ), అటల్ సహకారంతో ఇంట్రడక్షన్ టూ జెనెరేటివ్ ఏఐ మోడల్స్ అండ్ అప్లికేషన్స్ అనే అంశంపై జాతీయ స్థాయిలో ఆరు రోజుల పాటు జరగనున్న అధ్యాపక శిక్షణ తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ నిత్యం మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని సులభ మార్గంలో విద్యార్థులకు బోధించే విధంగా అధ్యాపకులు సిద్ధమవ్వాలని తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ) అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సాహించే విధంగా శిక్షణ తరగతులు దోహదపడతాయని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న ఈ శిక్షణ తరగతులకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 225 మంది అధ్యాపక బృందం పాల్గొంటున్నారని కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె. రవీంద్ర, సీఎస్‌బీఎస్ విభాగాధిపతి ఏ. నగేష్, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రజల అర్జీలకు సత్వర పరిష్కారం



గ్రీవెన్స్‌లో అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ జియా

పొన్నూరు: వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఆయన ఏడు అర్జీలను తీసుకున్నారు. ఇందులో భూమి సర్వే– 3, పౌర సరఫరా– 1, విద్యుత్ –1, ఆర్ అండ్ బీ 1, పశు సంవర్ధక శాఖ–1 ఉన్నాయని తెలిపారు. అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఏఓ దేగల వెంకట్రామయ్య, సీడీపీఓ వెంకట రమణ, డీటీ రాజా రమేష్, ఈఓపీఆర్‌డీ మల్లికార్జునరావు, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ, కమిషనర్

పొన్నూరు: మండలం, పట్టణంలోని అంగన్‌వాడీ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఎంపీడీఓ చంద్రశేఖరరావు ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం గుంటూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నీటి కుంటలు 14 పూర్తయ్యాయని, తొమ్మిది పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మరుగు దొడ్లు 15 పూర్తయ్యాయని, రెండు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. తాగునీటికి సంబంధించి 20 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. మిగిలిన పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీడీపీఓ వెంకట రమణ పాల్గొన్నారు.

నేడు చేబ్రోలు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

చేబ్రోలు: స్థానిక మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె. లలిత సోమవారం తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలగడ్డ సాహితి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, ఇతర అంశాల గురించి చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి



కాకుమాను:దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ముద్దన నగరాజ కుమారి అన్నారు.పెదనందిపాడులోని శ్రీ బాలా త్రిపుర సుందరి సోమేశ్వరిస్వామి దేవస్థానం, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానాల అధ్యక్షురాలిగా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.స్థానిక బాలా త్రిపుర సుందరి సోమేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం మాజీ చైర్మన్ దాసరి శేషగిరి రావు అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు. ఏకగ్రీవంగా ఎన్నికై న నగరాజ కుమారి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని ఆమె తెలిపారు.ఉపాధ్యక్షులుగా కూనిశెట్టి శ్రీనివాసరావు, వెలినేని రాంబాబు, కొల్లా సాంబశివరావు(నవత), కార్యదర్శిగా తడవర్తి సురేష్‌బాబు, జాయింట్ సెక్రటరీలుగా సకల వీరేంద్ర గుప్తా, శ్రీ రాం నాగేశ్వరరావు, కోశాధికారిగా దాసరి లక్ష్మీ శివరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ముద్దన రాఘవయ్య, పొన్నూరు బాల కుటుంబరావు, దాసరి సత్యనారాయణ, కొత్త శ్రీధర్, దాసరి వాసుదేవరావు, నున్న ఆంజనేయ గుప్తాలయ అర్చకులు వడ్లమూడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వ్యవసాయ భూముల సర్వే ప్రారంభం



సర్వే సందర్భంగా అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెదకాకాని: రైతులు పొలాల రీ సర్వే ప్రక్రియకు సహకరించి తమ భూములకు హద్దులు ఏర్పాటు చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. పెదకాకాని మండలంలోని అనుమర్లపూడిలో సోమవారం నుంచి ప్రైవేటు వ్యవసాయ భూముల హద్దులు నిర్ణయించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పొలాలు రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రీ సర్వే ప్రక్రియపై తహసీల్దార్, సర్వేయర్‌లతో చర్చించారు. అనంతరం గ్రామంలోని ఎస్సీకాలనీలో 50 కుటుంబాలకు గుంటూరు డయాసిస్ సోషల్ సర్వీస్ వెల్ఫేర్ సొసైటీ నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణకాంత్, సర్వేయర్ వీరాంజనేయులు, ఫాదర్ ఉన్నం కిరణ్, ఫాదర్ జ్యోతిరాజు పాల్గొన్నారు.

వెలుగులో అవినీతి చీకట్లు

- కొన్ని గ్రూపులపై సవతి తల్లి ప్రేమ
- సంతకాలు చెయ్యకుండా తిప్పుకుంటున్న అధికారులు
- ప్రత్తిపాడు వెలుగు అధికారులను ప్రశ్నించిన డ్వాక్రా మహిళ



సొంత ప్రభుత్వంలోనే పనులు కావడం లేదని వాపోతున్న వ్యక్తి



కార్యాలయం ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న సత్యవాణి

ప్రత్తిపాడు: వెలుగు అధికారుల తీరుతో తీవ్ర ఆవేదనకు గురైన ఒక మహిళ కార్యాలయం ఎదుటనే కన్నీటి పర్యంతరమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు మండలం గొట్టిపాడుకు చెందిన విఘ్నేశ్వర మహిళా గ్రూపు సభ్యులు రూ. 20 లక్షల బ్యాంకు లింకేజీ రుణం కోసం స్థానిక సెంట్రల్ బ్యాంకుకు వెళ్లారు. అక్కడ బ్యాంకర్లు డాక్యుమెంటేషన్ అంతా పరిశీలించారు. రుణం మంజూరు చేయాలంటే ఎంసీపీ (మైక్రో క్రెడిట్ ప్లాన్) పై వెలుగు అధికారుల సంతకం ఉండాలని సూచించారు. దీంతో గ్రూపులోని ఒక మహిళా సభ్యురాలు సత్యవాణి సోమవారం సాయంత్రం ప్రత్తిపాడు వెలుగు కార్యాలయానికి వచ్చారు. ఎంసీపీపై సంతకం చేయాలని ఏపీఎంను కోరారు. ఎంసీపీలపై సీసీలు, ఏపీఎంల సంతకాలు అవసరం లేదని, నేరుగా బ్యాంకుకు వెళితే రుణం మంజూచు చేస్తారని ఏపీఎం లాజరు సభ్యురాలికి వివరించారు. దీంతో ఏమిచేయాలో పాలుపోని ఆ మహిళ తన ఆవేదనను వెళ్లగక్కింది.
వెలుగు అధికారులు తమ గ్రామంలో అనేక గ్రూపులకు ఎంసీపీలపై సంతకాలు చేశారని తెలిపింది. డాక్యుమెంటేషన్ చేయించుకునేందుకు వాళ్లు చెప్పిన వీవోఏ వద్దకు వెళ్లకుండా సొంతంగా తయారు చేసుకున్నామని, సంతకాలు పెట్టకుండా తిప్పుకుంటున్నారని కార్యాలయం ఎదుట నిలబడి భోరున విలపించింది. అధికారులు సూచించిన ఆ వీవోఏ వద్దకు వెళితే గతంలో యాభై వేల రూపాయల రుణం ఇప్పించినందుకు పాతిక వేల రూపాయల లంచం తీసుకున్నదని ఆరోపించింది. అందుకే ఆ వీవోఏ వద్దకు వెళ్లకుండా తాము నేరుగా లోను కోసం ప్రయత్నాలు చేస్తున్నందుకే అధికారులు ఇలా సంతకాలు చేయకుండా నానా తిప్పలూ పెడుతున్నారని వాపోయింది.

- మహిళతో పాటు వచ్చిన ఓ టీడీపీ కార్యకర్త కూడా ప్రభుత్వ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రుణం కోసం వస్తే ఇలా తిప్పుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇదే పని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అయితే నిమిషాల్లో అయిపోయేదని తెలిపారు. సొంత ప్రభుత్వంలోనే పనులు చేయించుకోలేకపోతున్నామనే బాధ కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగాలకు 160 మంది విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్ గోపీచంద్, సురేష్‌బాబు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో సోమవారం సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 160 మంది విద్యార్థులు ఉద్యోగాలను ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి. గోపీచంద్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో జేకేసీ కళాశాల నుంచి 114 మంది, సెయింట్ ఆన్స్ కళాశాల నుంచి 43 మంది ఉన్నారని వివరించారు. వీరికి రూ.2.5 లక్షల నుంచి రూ.మూడు లక్షల వరకు వార్షిక వేతనాన్ని ఇవ్వనున్నట్లు సదర్లాండ్ ప్రతినిధులు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, ప్లేస్‌మెంట్స్ అధికారి వై.సురేష్‌బాబు అభినందించారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ తరగతులు



సర్టిఫికెట్లను అందజేస్తున్న లాంపాం సహపరిశోధన సంచాలకులు దుర్గాప్రసాద్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో గల ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై 15 రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న పీఎసీఎస్ ప్రతినిధులకు సోమవారం లాంఫాం సహపరిశోధన సంచాలకులు ఎస్.వి.వి.ఎస్. దుర్గాప్రసాద్, సమేతి అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ పుణ్యవతి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ఎన్. వెంకటలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త ఎం. వెంకటరాములు పాల్గొన్నారు.